కమలాపూర్ : గూడూరులో తహసీల్దార్ సురేశ్‌కుమార్‌తో వాగ్వాదం

హసన్‌పర్తి : సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

రసాభాసగా గ్రామసభలు

- అర్హులకు అన్యాయం చేశారంటూ అధికారుల నిలదీత
- జాబితాలో పేర్లు లేవంటూ ఆందోళన

శాయంపేట, జనవరి 21 : ప్రభుత్వ పథకాలపై మంగళవారం నిర్వహించిన గ్రామసభల్లో నిరసనలు వ్యక్తమయ్యాయి. రేషన్‌కార్డులు, రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ఈనెల 26నుంచి ప్రారంభించనున్న నేపథ్యంలో లబ్ధిదారుల ఎంపికకు గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం అధికారులు లబ్ధిదారుల జాబితాను చదివి వినిపించారు. ఈ క్రమంలో పలు గ్రామాల్లో తమ పేర్లు, లేవని. అనర్హులు జాబితాలో ఉన్నారంటూ అధికారులను నిలదీశారు. దీంతో అధికారులు వారికి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. ఇది ఫైనల్ లిస్టు కాదనీ, మళ్లీ దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తామని తెలిపారు. దీంతో ప్రజలు మళ్లీ దరఖాస్తు చేసుకున్నారు. శాయంపేట మండలంలోని అప్పయ్యపల్లి, నేరేడుపల్లి, పెద్దకోడెపాక, సూర్యానాయక్ తండా గ్రామాల్లో ఎంపీడీవో, రెవెన్యూ, కార్యదర్శులు, ఏఈవోలు హాజరై గ్రామసభలు నిర్వహించారు. నేరేడుపల్లి గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగులకు, భూములు ఉన్న వారి పేర్లు రేషన్‌కార్డుల జాబితాలో ఎలా వచ్చాయని ప్రజలు అధికారులను ప్రశ్నించారు. గ్రామసభ రసాభాసగా మారడంతో పోలీసులు చేరుకుని బందోబస్తు నిర్వహించారు. సూర్యానాయక్‌తండా గ్రామసభలో రేషన్‌కార్డుల జాబితాలో తమ పేర్లు లేవని పలువురు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అనర్హులను గుర్తిస్తామని అధికారులు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఫణిచంద్ర, ఎంపీవో రంజిత్‌కుమార్ తదితరులున్నారు.

మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి : ఎమ్మెల్యే గండ్ర

ప్రభుత్వ పథకాలకు గ్రామసభల్లో వచ్చిన జాబితాల్లో పేర్లు లేకపోతే అర్హులు దరఖాస్తు చేసుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శాయంపేట మండలంలోని తహరాపూర్‌లో మంగళవారం జరిగిన గ్రామసభకు ఎమ్మెల్యే హాజరయ్యారు. నియోజకవర్గానికి 3500ఇండ్లు వచ్చాయని, సీఎంతో మాట్లాడి మరో 3500ఇండ్లు తీసుకొచ్చి పూరిగుడిసె, పెంకుటిల్లులో ఉంటున్న వారికే మొదట ఇండ్లు ఇస్తామన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద భూమి లేని ఉపాధి కూలీలను పక్కాగా ఎంపిక చేయాలన్నారు. తహరాపూర్ పక్కనే ఉన్న క్రషర్లను సీజ్ చేయిస్తానని అన్నారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డికి దరఖాస్తు ఇచ్చానన్నారు. ఒక క్రషర్‌కు రూ.170 కోట్లు, మరోదానికి రూ.80కోట్లు, మరోదానికి రూ.60 కోట్లు కట్టాలని నోటీసులు ఇచ్చామన్నారు. హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారన్నారు. ఆ స్టేను వెకెట్ చేయించి మూడు క్రషర్లను సీజ్ చేయిస్తానని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఫణిచంద్ర, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీవో రంజిత్, ఏవో గంగాజమున, ఏఎంసీ వైస్ చైర్మన్ మారెపల్లి రవీందర్, చల్లా చక్రపాణి, దూదిపాల బుచ్చిరెడ్డి, పోలెపల్లి శ్రీనివాస్‌రెడ్డి, చిందం రవి పాల్గొన్నారు.

47, 61వ డివిజన్‌లో..

కాజీపేట : కాజీపేట పట్టణం 47వ డివిజన్‌లోని ఇంపీరియల్ కాలనీ కమ్యూనిటీ హాల్, 61వ డివిజన్ సిద్ధార్థనగర్ కమ్యూనిటీహాల్‌లో ప్రజాపాలన వార్డు సభ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సభకు ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, తహసీల్దార్ బావ్‌సింగ్, కార్పొరేటర్లు సంకు నర్సింగరావు, జక్కుల రవీందర్‌యాదవ్, విజయశ్రీ, రజాలీతోపాటు స్థానికులు పాల్గొన్నారు.

గూడూరులో అధికారుల నిలదీత

కమలాపూర్ : మండలంలోని గూడూరు, కన్నూరు, దేశరాజ్‌పల్లి, శనిగరం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. గూడూరులో ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో అనర్హులను ఎంపిక చేశారని తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామస్తుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కన్నూరు, దేశరాజ్‌పల్లి, శనిగరం గ్రామాల్లో సంక్షేమ పథకాలు అర్హులకు ఇవ్వడం లేదని అధికారులపై మండిపడ్డారు. గ్రామసభల్లో ఎంపీడీవో బాబు, ఎంపీవో రవి, పీఆర్ఏఈ మధు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : మండలంలోని అగ్రంపహాడ్, అక్కంపేట, కామారం, హౌసుబుజుర్గు గ్రామ పంచాయతీల్లో మంగళవారం గ్రామసభల్లో జాబితాను ప్రచురించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ మహేందర్, మండల ప్రత్యేక అధికారి రాజేందర్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీవో విమల, ఎంఈవో విజయ్‌కుమార్, గ్రామ పంచాయతీ అధికారులు, ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్ ప్రావీణ్య

హసన్‌పర్తి : ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. నాగారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ప్రజాపాలన గ్రామసభ నిర్వహించారు. కలెక్టర్ ప్రావీణ్య ఈ కార్యక్రమంలో పాల్గొని గ్రామ సభలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌లను పరిశీలించారు. హెల్ప్ డెస్క్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల పత్యేక అధికారి వెంకటేశ్వర్లు, డీఎల్పీవో గంగాభవాని, ఇన్‌చార్జి ఎంపీడీవో కరుణాకర్‌రెడ్డి, డీటీ రహీంపాషా, ఏపీవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

వేలేరులో..

వేలేరు : మండలంలోని కన్నారం, మద్దెలగూడెం, గుండ్లసాగర్, గొల్లకిష్టంపల్లి, బండతండా గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. ఆయా పథకాల్లో తమ పేర్లు లేవని అధికారులను ప్రజలు నిలదీశారు. జనవరి 24వరకు మళ్లీ గ్రామపంచాయతీ వద్ద దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు సూచించారు. ఈ గ్రామసభలలో వేలేరు మండల ప్రతేకాధికారి మల్లయ్య, తహసీల్దార్ కొమి, వేలేరు ఎస్సై ఏ సురేశ్, ఆర్ఐ సురేందర్, ఏఈవోలు రాజశేఖర్, విజయ్, ఆయా గ్రామాల పంచాయతీ సెక్రటరీలు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భీమదేవరపల్లిలో...

భీమదేవరపల్లి : మండలంలోని భీమదేవరపల్లి, బొల్లోనిపల్లి, గాంధీనగర్, కొప్పూర్, కొత్తకొండ, రాంనగర్, రసూల్‌పల్లిలో గ్రామసభలు జరిగాయి. అనర్హులను ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో వెల్లడించారని గ్రామస్తులు మండిపడ్డారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జాబితాలో భూములు ఉన్న వారి పేర్లు వచ్చాయని అధికారులను నిలదీశారు. విచారణ జరిపి అనర్హుల పేర్లు తొలగిస్తామని అధికారులు చెప్పారు. కొత్తకొండ గ్రామసభలో గొడవలు జరిగే అవకాశం ఉందని తెలియడంతో ఎల్కతుర్తి సీఐ పులి రమేశ్, ముల్కనూరు ఎస్సై నండ్రు సాయిబాబు బందోబస్తు నిర్వహించారు.

ధర్మసాగర్‌లో..

ధర్మసాగర్ : ధర్మసాగర్, తాటికాయల, ముప్పారం, రాయగూడెం, నారాయణగిరి, ఎలుకుర్తి, మల్లక్‌పల్లె, ధర్మపురం గ్రామాల్లో ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. ధర్మసాగర్, తాటికాయల గ్రామాల్లోని ఇండ్లు మంజూరులో తమ పేర్లు లేవని గ్రామసభకు వచ్చిన ఆర్డీవో రాథోడ్ రమేశ్, తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో అనిల్‌కుమార్ నిలదీశారు. ఇండ్లు ఉన్నవారికే మళ్లీ ఇండ్లు వచ్చాయని ధర్మసాగర్ గ్రామానికి చెందిన బొద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి అధికారులను నిలదీశారు. ఇందిరమ్మ కమిటీ సభ్యుడు రావుల వెంకట్‌రెడ్డి తనకు ఇల్లు లేదని, దరఖాస్తు పెట్టుకున్నా లిస్టులో పేరు రాలేదని అధికారులను అడిగారు. రీ సర్వే చేయాలని కోరారు. తాటికాయల గ్రామంలో పలువురు తమకు ఇండ్లు రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన వారి పేర్లే వచ్చాయని ఆరోపించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు సంపత్, పలువురు గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. ముప్పారంలో నిర్వహించిన గ్రామసభలో ఉమ్మడి వరంగల్ జిల్లాల ప్రత్యేక ఐఏఎస్ అధికారి వినయకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రజల సందేహాలను నివృత్తి చేశారు. మల్లక్‌పల్లెలో డీఆర్డీవో మేన శ్రీను, ఆర్డీవో రమేశ్ పాల్గొన్నారు.

51వ డివిజన్‌లో..

హనుమకొండ : 51వ డివిజన్ పరిధిలో వాటర్‌ట్యాంక్ ఆవరణలో నిర్వహించిన వార్డు సభలో స్థానిక కార్పొరేటర్ బోయినపల్లి వినోద్ కుమార్, హనుమకొండ తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డితోపాటు మున్సిపల్ అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. 59వ డివిజన్‌లోని భవానీనగర్ వాటర్ ట్యాంక్ ఆవరణలో నిర్వహించిన సభలో స్థానిక కార్పొరేటర్ గుజ్జుల వసంత, డివిజన్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు, జీడబ్ల్యూఎంసీ ఏఈ అజ్మీరా శ్రీకాంత్, ఆర్ఐ దశరథ రాంరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు. బాధితులు ఎక్కువగా రావడంతో దరఖాస్తులు సరిపోక గందరగోళ పరిస్థితి ఏర్పడింది.

కార్పొరేటర్ శ్రీనివాస్‌ను నిలదీత..

హనుమకొండ చౌరస్తా : హనుమకొండ మచిలీబజార్ కమ్యూనిటీహాల్ గ్రామసభలో కార్పొరేటర్ వేముల శ్రీనివాస్‌ను స్థానిక ప్రజలు, బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు నయీమొద్దీన్ నిలదీశారు. దీంతో ఆయా పథకాలకు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

గందరగోళంగా గ్రామసభ..

ఐనవోలు : మండలంలోని పున్నేల్ గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభకు అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డితో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హాజరై గ్రామస్తుల నుంచి దరఖాస్తులు స్వీకరించి గ్రామసభను ప్రారంభించారు. పున్నేల్‌లో 113ఎకరాల భూమిని రైతు భరోసా నుంచి తొలగించినట్లు అధికారులు తెలిపారు. కాగా, జాబితాలో నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరిగిందని తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏవో సునీల్‌కుమార్‌రెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శి అశోక్‌ను గ్రామస్తులు చుట్టుముట్టారు. పర్వతగిరి సీఐ రాజగోపాల్ కల్పించుకోవడంతో ప్రజలు శాంతించారు. మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

హనుమకొండ చౌరస్తా : కార్పొరేటర్ వేముల శ్రీనివాస్‌ను నిలదీస్తున్న స్థానికులు

ఐనవోలు: పున్నేల్ గ్రామంలో అధికారులను చుట్టుముట్టిన గ్రామస్తులు

11వ డివిజన్ వార్డు సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

గ్రేటర్‌లో వార్డు సభలు షురూ

- 20 డివిజన్లలో తొలి రోజు 8,595 దరఖాస్తులు
- పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, జనవరి 21: ఈ నెల 26 నుంచి ప్రభుత్వం అమలు చేయనున్న నాలుగు గ్యారెంటీల లబ్ధిదారుల ఎంపిక కోసం గ్రేటర్‌లో వార్డు సభలు ప్రారంభించారు. మంగళవారం 20డివిజన్‌లలో వార్డు సభలు నిర్వహించారు. తూర్పు నియోజవర్గం పరిధిలోని 12,19,22,25,28,36,37,40, పశ్చిమ నియోజవర్గంలోని 7,11,47,51,52,54,59,61 వర్ధన్నపేట నియోజవర్గం పరిధిలోని 1,14,66, పరకాల నియోజవర్గం పరిధిలోని 16 డివిజన్లలో వార్డు సభలను నిర్వహించారు. వార్డు సభలలో పెద్దఎత్తున దరఖాస్తులు వెల్లువెత్తాయి. అనేక మందికి ఫారాలు అందలేదు. దీంతో అక్కడికి వచ్చిన ప్రజలు సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. పశ్చిమ నియోజవర్గంలోని 11,47,61 డివిజన్లలో నిర్వహించిన వార్డు సభలలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు. అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేస్తామని అన్నారు. తూర్పు నియోజవర్గంలోని 22వ డివిజన్‌లో నిర్వహించిన వార్డు సభకు కమిషనర్ అశ్విని తానాజీ వాకడే హాజరయ్యారు. ధరఖాస్తుదారుల సందేహాల నివృత్తి కోసం హెల్ప్ లైన్‌లను ఏర్పాటు చేశామని అన్నారు.

తొలి రోజు 8595 దరఖాస్తులు

గ్రేటర్ కార్పొరేషన్‌లో 20డివిజన్‌లలో నిర్వహించిన వార్డు సభలో పెద్దఎత్తున దరఖాస్తులు వెల్లువెత్తాయి. తొలిరోజు వార్డు సభలో 8595 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో ఎక్కువగా రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం చేసుకున్నారు. రేషన్‌కార్డులకు 5,908దరఖాస్తులు రాగా, ఇందిరమ్మ ఇళ్లకు 2,687దరఖాస్తులు వచ్చాయి.

నేడు వార్డు సభలు జరిగే డివిజన్లు..

గ్రేటర్‌లో రెండో రోజు 18డివిజన్లలో వార్డు సభలు నిర్వహించనున్నారు. పశ్చిమ నియోజవర్గంలోని 5వ డివిజన్ వార్డు సభను గురువారానికి వాయిదా వేసినట్లు గ్రేటర్ అధికారులు ప్రకటించారు. తూర్పు నియోజవర్గంలో 13,20,23,26,32, 34,38,41 డివిజన్లు, పశ్చిమ నియోజవర్గంలో 4, 29, 30,49,53,63 డివిజన్లు, వర్ధన్నపేట నియోజవర్గంలో 43 ,45,56 డివిజన్లు, పరకాల నియోజవర్గంలో 17వ డివిజన్‌లో సభలు నిర్వహించనున్నారు.

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి

నగర పోలీస్ కమిషనర్ అంబర్‌కిశోర్ ఝా


ఊరుగొండలో వృద్ధులతో మాట్లాడుతున్న సీపీ

దామెర, జనవరి 21 : ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో అర్హులను గుర్తించేందుకు ఏర్పాటు చేసిన గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగర పోలీస్‌కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా సూచించారు. మంగళవారం మండలంలోని ఊరుగొండ, ల్యాదెళ్ల, ముస్త్యాలపల్లి, ఓగులాపురం, పసరగొండ గ్రామాల్లో నాలుగు సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామ సభలు జరిగాయి. ఈ సందర్భంగా ఊరుగొండ గ్రామ సభాప్రదేశాన్ని సీపీ అందర్‌కిశోర్‌ఝా పరిశీలించారు. గొడవలకు పోకుండా శాంతియుతంగా గ్రామసభల్లో ప్రజలు పాల్గొని సంక్షేమ పథకాలను పొందాలన్నారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో రంగాచారి, సీఐ రంజిత్‌రావు, ఎస్సై కొంక అశోక్, ఏపీవో శారద, పంచాయతీ కార్యదర్శులు నరేశ్, రామ్మూర్తి పాల్గొన్నారు.

మార్కెటింగ్ స్కీంలపై అప్రమత్తంగా ఉండాలి

సుబేదారి, జనవరి 21 : మోసపూరిత ప్రకటనలతో మోసాలకు పాల్పడుతున్న మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీంలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్‌కిశోర్‌ఝా మంగళవారం ఒక ప్రకటనలో ప్రజలకు సూచించారు. ప్రజల సొమ్ము దోచుకునేందుకు సైబర్ నేరగాళ్లు రోజురోజుకీ కొత్తపోకడలతో ప్రజల బలహీనతలను పెట్టుబడిగా చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీంలతోపాటు పిరమిడ్ లాంటి స్కీంల ద్వారా ప్రజల నుంచి డబ్బు దోచేస్తున్నారన్నారు. ఈ రకమైన మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ సూచించారు. విదేశీ యాత్రలకు పంపిస్తామని మోసపూరితమైన వాగ్దానాలతో ఈ స్కీంలను నిర్వహిస్తున్న సైబర్ నేరగాళ్లు మొదట కొంత రుసుముతో ప్రాథమిక సభ్యత్వాన్ని కల్పిస్తారని తెలిపారు. సభ్యత్వం పొందిన వారితో మరికొంత మందిని సభ్యత్వం కల్పిస్తే, ఎక్కువ మొత్తం పెట్టిన పెట్టుబడికి రెట్టింపు వస్తుందని, ఎక్కువ మొత్తంలో సభ్యులను సభ్యులుగా చేర్పిస్తే పెద్ద మొత్తంగా డబ్బు వస్తుందని ప్రజలను మభ్యపెట్టి రూ.కోట్లల్లో డబ్బు లాగుతున్నారని సీపీ తెలిపారు. మాటలతో ప్రజల దృష్టిని ఆకర్షించే రీతిలో ఉండే వారి ప్రకటనలపై ప్రజలు మోసపోవద్దన్నారు. ఈ స్కీంలపై అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఎవరైనాఇలాంటి స్కీంల ద్వారా మోసపోతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కుగానీ లేదా https://www.cybercrime.gov.in అనే వెబ్ సైట్‌లో కానీ సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సీపీ సూచించారు. బాధితులు వరంగల్ పోలీసు కమిషనరేట్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సీపీ కోరారు.

మార్కెట్‌లోకి క్రెటా ఎలక్ట్రిక్ కారు విడుదల


మార్కెట్‌లోకి క్రెటా ఎలక్ట్రిక్ కారును విడుదల చేస్తున్న ఎస్‌బీఐ ఏజీఎం రాజశేఖర్, షోరూం డైరెక్టర్ పృథ్వీ

వరంగల్, జనవరి 21 : మార్కెట్‌లోకి క్రెటా ఎలక్ట్రిక్ కారు విడుదలైంది. మంగళవారం ములుగురోడ్డులోని హేమ హ్యూందయ్ కారు షోరూంలో ఎస్‌బీఐ బ్యాంక్ ఏజీఎం రాజశేఖర్, షో రూం డైరెక్టర్లు పృథ్వీలు క్రెటా ఎలక్ట్రిక్ కారును మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా షోరూం డైరెక్టర్ పృథ్వీ మాట్లాడుతూ అధునాతన ఫీచర్లతో కూడిన సరికొత్త బ్యాటరీ ఏర్పాటు చేశారన్నారు. బ్యాటరీ ఫుల్ చార్జింగ్ చేస్తే 473కిలోమీటర్లు ప్రయాణం చేయవచ్చని ఆయన తెలిపారు. 8సెకన్లలో సున్న నుంచి వంద కిలోమీటర్ల వేగానికి చేరుకుంటుందన్నారు. వెహికిల్ టూ లోడ్ ఫీచర్ బ్యాటరీతోపాటు సెల్‌ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లు చార్జింగ్ చేసుకోచ్చని వివరించారు. కారు రూ. 17.99 లక్షల నుంచి రూ.24.37 లక్షల వరకు లభ్యమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ అధిత్య, ఏజీఎం మహేశ్, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం అందించాలి

- భీమారం నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు పాదయాత్ర
- కలెక్టరేట్ ఎదుట ధర్నా



పాద యాత్రగా వస్తున్న ఆశలు

హనుమకొండ, జనవరి 21 : ఆశ వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనంపై రానున్న అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భీమారం నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించారు. హనుమకొండ కలెక్టరేట్‌కు చేరుకుని ధర్నా చేశారు. కలెక్టరేట్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. లేదంటే అసెంబ్లీని ముట్టడిస్తామని రమేశ్ హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఆఫీస్ బేరర్స్ బొట్ల చక్రపాణి, మెట్టు రవి, నాయకులు కే పద్మ, యాకూబీ, రజిత, సూర్యకళ, సంధ్య, ఈ శోభ, పద్మ, పుతిలీ, సీహెచ్ శ్రీవాణి, రామలీల, సుకన్య, శ్రీలతలతోపాటు పెద్ద సంఖ్యలో ఆశలు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

LOSS OF PASSPORT

★ I, **NITESH MUNDADA, S/o VENUGOPAL MUNDADA,** R/o H.No. 8-4-71, Sri Krishna Colony, Station Road, WARANGAL Dist., TG, have Lost the Passport bearing No. **B3795251.** while travelling from my house to Polavari Street, Girmajipet by bike. If anyone is found, please inform me at the above address and contact **M: +91 99083 50505**

NTW-17465

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

టీచర్ల బదిలీల సర్టిఫికెట్ల పరిశీలన

హనుమకొండ చౌరస్తా, జనవరి 21 : జిల్లాలో మ్యుచువల్ బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న టీచర్ల సర్టిఫికెట్ల పరిశీలన ముగిసింది. మంగళశారం హనుమకొండలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో మ్యుచువల్ బదిలీ టీచర్ల ధ్రువపత్రాల, సర్వీస్ పుస్తకాల, అండర్‌టేకింగ్ పత్రాల పరిశీలన పూర్తయినట్లు జిల్లా విద్యాశాఖాధికారి డీ వాసంతి తెలిపారు. జిల్లాలో 91మంది ఉపాధ్యాయులు ఇందులో పాల్గొన్నట్లు ఆమె చెప్పారు. పరిశీలనకు సంబంధించిన అన్ని వివరాలతో కూడిన నివేదికను రాష్ట్ర విద్యాశాఖకు అందించనున్నట్లు డీఈవో తెలిపారు.

భారీ శబ్దంతో ఉలిక్కిపడ్డ పసరగొండ

దామెర, జనవరి 21: మండలంలోని పసరగొండలో మంగళవారం రాత్రి భారీశబ్దంతో గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. భూమి పెద్దగా కంపించడంతో గ్రామస్తులు ఇండ్ల నుంచి బయటికి పరుగులు తీశారు. భయంతో వణికిపోతూ ఏం జరిగిందని ఆరా తీశారు. గ్రామ శివారులోని శ్రీసాయి ఇన్‌ఫ్రా స్టోన్ క్రషర్‌లో 200అడుగుల లోతులో బాంబులు పెట్టి పేల్చడంతో ఒక్కసారిగా భారీ శబ్దం వెలువడి భూమి కంపించింది. గ్రామానికి చెందిన పోతరాజు కుమారస్వామి దుకాణ షటర్ ఊగడంతోపాటు ఇదే గ్రామానికి చెందిన మేడిపల్లి ఎల్లయ్య ఆ శబ్దం ధాటికి స్టూల్‌పై నుంచి కిందపడిపోయాడు.

నేటి నుంచి గ్రామసభలు

ఎల్కతుర్తి, జనవరి 21 : రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డ్స్, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల్లో లబ్ధిదారుల జాబితా, దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 22నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆరెపల్లి, చింతలపల్లి, గుంటూర్‌పల్లి, ఇందిరానగర్, కోతులనడుమ, పెంచికల్‌పేట, శాంతినగర్, సూరారం, వీరనారాయణపూర్ గ్రామాల్లో సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 23న దండేపల్లి, గోపాల్‌పూర్, జగన్నాథపూర్, జీల్గుల, కేశవాపూర్, రామకృష్ణాపూర్, తిమ్మాపూర్ గ్రామాల్లో, 24న బావుపేట, దామెర, ఎల్కతుర్తి, వల్భాపూర్ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ సభల్లో ఎంపికైన లబ్ధిదారుల జాబితా చెప్పడంతోపాటు పథకాలు రాని లబ్ధిదారుల నుంచి కూడా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు.

సొంత ఖర్చుతో వాటర్‌పైప్‌లైన్ ఏర్పాటు


పైప్‌లైన్‌ను ఏర్పాటు చేసుకుంటున్న కాలనీ వాసులు

నయీంనగర్, జనవరి 21 : వడ్డేపల్లిలోని ఎస్‌డీడీ కాలనీ కమ్యూనిటీ పార్కులో వాటర్ పైప్‌లైన్ లేక పార్కులోని చెట్లు ఎండిపోతున్నాయి. ఈ విషయాన్ని టౌన్‌ప్లాన్ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోకవడంతో కాలనీవాసులు తమ సొంత ఖర్చులతో వాటర్ పైప్‌లైన్ ఏర్పాటు చేసుకున్నట్లు కాలనీవాసులు తెలిపారు. 300మీటర్లతో శాశ్వత వాటర్ పైప్‌లైన్, మధ్యమధ్యలో గేట్ వాల్స్ ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నల్లాని శ్రీనివాస్, వీరబ్రహ్మచారి, రవీందర్, శ్రీరామ్, శంకరాచారి, సత్యం, రాజాప్రభు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'నానో యూరియా, నానో డీఏపీలతో అధిక లాభాలు'



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇఫ్కో సీఈవో మధులిక

హనుమకొండ చౌరస్తా, జనవరి 21 : పంట సాగుకు నానో యూరియా, నానో డీఏపీల(ద్రవ) ఉత్పత్తులతో పంట దిగుబడి అధికంగా ఉంటుందని ఇఫ్కో సీఈవో శుక్లా మధులిక తెలిపారు. హనుమకొండలో ఇఫ్కో రైతుల సహకార సంస్థ ఆధ్వర్యంలో ఇఫ్కో డీలర్లు, రైతుల అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మధులిక మాట్లాడుతూ పంట దిగుబడి గణనీయంగా పెరుగాలన్నా, ఉత్పత్తులు నాణ్యంగా రావాలన్నా గుళికల రూపంలో ఉన్న ఎరువులు చల్లుతారని తెలిపారు. వీటి వాడకం మోతాదుకుమించడంతో పలు అనర్థాలకు దారితీస్తోందన్నారు. దీన్ని అరికట్టేందుకు ప్రఖ్యాత ఎరువుల తయారీ సంస్థ ఇఫ్కో పలు పరిశోధనల తర్వాత నానో ఉత్పత్తుల యూరియా, డీఏపీ ద్రవరూపంలో రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. వీటి వాడకం వల్ల ఆరోగ్యకరమైన పంట దిగుబడి వస్తుందన్నారు. స్టేట్ మార్కెటింగ్ మేనేజర్ కృపాశంకర్, వరంగల్ ఇఫ్కో జిల్లా మేనేజర్ విశాల్‌షిండే, హనుమకొండ జిల్లా మేనేజర్ అక్షయరెడ్డి, రీజినల్ మేనేజర్ రాజు, డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

బస్ సెల్టర్‌లో ఒకరి మృతి

కాజీపేట, జనవరి 21 : ఆర్థిక ఇబ్బందులతో తాగుడుకు బానిసై అనారోగ్యంతో కాజీపేట పట్టణం జూబ్లీమార్కెట్ బస్‌స్టాఫ్ సెల్టర్‌లో కరు మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. కాజీపేట పోలీసులు తెలిపిన ప్రకారం.. వరంగల్ కరీమాబాద్‌కు చెందిన వంగర రమేశ్ (44) గతంలో కిరసనాయిల్ వ్యాపారం చేస్తూ భార్య ఉమ, ఇద్దరు కూతుళ్లతో జీవించే వాడు. వ్యాపారంలో నష్టం రావడం, భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండడంతో రమేశ్ కొంతకాలంగా కాజీపేటకు వచ్చి జూబ్లీమార్కెట్‌లో చిన్న చిన్న పనులు చేసుకుని ఒంటరిగా జీవిస్తున్నాడు. ఈ క్రమంలో రమేశ్ మద్యానికి బానిసై అనారోగ్యంతో బాధపడుతున్నట్లు చెప్పారు. సోమవారం రాత్రి మద్యం బాగా తాగిపడుకోవడంతో గొంతు ఎండిపోయి మరణించి ఉండవచ్చని, మరణంపై ఎలాంటి అనుమానాలు లేవని మృతుడి భార్య ఉమ ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

ఆత్మకూరు, జనవరి 21 : వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని పరకాల ఏసీపీ సతీశ్ బాబు అన్నారు. మంగళవారం రాత్రి నీరుకుళ్ల గ్రామంలో సీఐ సంతోశ్ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ సతీశ్‌బాబు మాట్లాడుతూ గ్రామాల్లో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అక్రమ మద్యం,గుడుంబా, సరైన ధ్రువ పత్రాలు లేని వాహనాలు సీజ్ చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అక్రమ మద్యం, గుడుంబా, గుట్కా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో సిఐలు సంతోశ్, క్రాంతికుమార్, ఎస్సై పరమేశ్వర్, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి ఎస్సైగా ప్రవీణ్‌కుమార్

ఎల్కతుర్తి, జనవరి 21 : ఎల్కతుర్తి ఎస్సైగా బదిలీపై వచ్చిన అక్కెనపల్లి ప్రవీణ్‌కుమార్ మంగళవారం విధుల్లో చేరి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన రాజుకుమార్ బదిలీపై సీసీఎస్‌కు వెళ్లగా, ఆయన స్థానంలో సీసీఆర్‌బీ ఎస్సైగా పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్‌ను ఎల్కతుర్తి ఎస్సైగా వరంగల్ కమిషనర్ అంబర్‌కిశోర్ ఝా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మంగళవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

రూ.57వేలు అందించిన ఆర్ట్స్ కాలేజీ అధ్యాపకులు

హనుమకొండ చౌరస్తా, జనవరి 21: ఆర్ట్స్ కాలేజీలో ల్యాబ్ స్టోర్ కీపర్‌గా పనిచేసే నర్మెట ఐలయ్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఐలయ్య కుటుంబ సభ్యులకు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది రూ.57వేలు ఆర్థిక సాయం చేశారు. రూ.57వేలతో ఎల్ఐసీ బాండును ఐలయ్య కూతురు శ్రీనిధి పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. మంగళవారం బోధనేతర సిబ్బంది సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి ముఖ్యఅతిథిగా పాల్గొని కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం బాండ్‌ను అందజేశారు. బోధనేతర సిబ్బంది సంఘం అధ్యక్షుడు రాజు, అధ్యాపకులు సదాశివ్, ప్రవీణ్, కాలేజీ లైబ్రేరియన్ నరసయ్య, ఐలయ్య కుటుంబ సభ్యులు, కాలేజీ ఉద్యోగస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ పోలీసుల దాడులు : నలుగురి అరెస్ట్

శాయంపేట, జనవరి 21 : ఎక్సైజ్ పోలీసులు మంగళవారం నిర్వహించిన దాడుల్లో గుడుంబా విక్రేతలు నలుగురిని అరెస్టు చేసి, 20లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు పరకాల ఎక్సైజ్ సీఐ తాతాజీ తెలిపారు. గుడుంబా నిర్మూలన స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా పరకాల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పోచారం, గట్లకానిపర్తి, కామారెడ్డిపల్లి, పరకాలలో గుడుంబా కేంద్రాలపై దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో పరకాలకు చెందిన సాధు సరోజన, గట్ల కనపర్తికి చెందిన మోరే మదనమ్మ, ఆకునూరి మమత, బొమ్మ శారదలను అరెస్టు చేసి వారి నుంచి 20లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఎక్సైజ్ ఎస్సై సులోచన, కానిస్టేబుల్ లక్ష్మణాచారి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

బహుమతి గెలుచుకున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డి

అంతర్జాతీయ హైపర్‌మోడ్ నాలెడ్జ్‌గ్రాఫ్‌లో కిట్స్ విద్యార్థులకు బహుమతి

హసన్‌పర్తి, జనవరి 21 : అంతర్జాతీయ హైపర్‌మోడ్ నాలెడ్జ్ గ్రాఫ్, ఏఐ ఛాలెంజ్ ఇంటర్ నేషనల్ హ్యాకథాన్‌లో గ్రాండ్ ప్రైజ్‌ను కిట్స్ (వరంగల్) విద్యార్థులు పావుశెట్టి యశ్వంత్, ఈషా బెల్లాడి రూ.2.7లక్షల బహుమతిని గెలుచుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మన దేశం నుంచి కిట్స్ విద్యార్థులు బహుమతులు సాధించడం గర్వంగా ఉందన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపకుల అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, జనవరి 21 : హనుమకొండ టౌన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ ఆపరేషన్ డీఈ జీ సాంబారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభివృద్ధి పనుల్లో భాగంగా బుధవారం న్యూ శాయంపేట సబ్‌స్టేషన్ విద్యుత్ నగర్ 11కేవీ ఫీడర్ పరిధిలో ఉదయం 9నుంచి 11గంటల వరకు ప్రకాశ్‌రెడ్డిపేట, పోస్టల్ కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, విద్యుత్‌నగర్, కేయూసీ సబ్‌స్టేషన్ కిషన్‌పుర 11కేవీ ఫీడర్ పరిధిలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కిషన్‌పుర, లష్కర్‌బజార్, నయీంనగర్ 11కేవీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2గంటల వరకు నయీంనగర్ ఏరియాలో, యాదవనగర్ సబ్‌స్టేషన్ యాదవనగర్ 11కేవీ ఫీడర్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి 10.30గంటల వరకు కొత్తూర్‌రోడ్డు, చర్చి, మార్కెట్ వెనుక వైపు, తోటబడి, తొటబడి వెనుక వైపు ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని అన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.